సాక్షి
అనంతపురం
ఆదివారం । 30 । మార్చి । 2025




చీనీ టన్ను రూ.24,300

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,300 పలికాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

కాంక్రీట్ లైనింగ్ పనులు ఆపాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐకేకేఎంఎస్ నాయకులు, రైతులు

అనంతపురం అర్బన్: హంద్రీ–నీవా కాలువలో కాంక్రీట్ లైనింగ్ పనులు ఆపి.. కాలువ వెడల్పు చేయాలని అఖిల భారత రైతు వ్యవసాయ కూలీ సంఘం (ఏఐకేకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిరీష్, ప్రధాన కార్యదర్శి నాగముత్యాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ హంద్రీ–నీవా కాలువ వల్ల భూగర్భజలాలు పెరిగి వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారన్నారు. కాలువకు లైనింగ్ చేస్తే నీరు భూమిలోకి ఇంకక భూగర్భ జలాలు పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. తాగునీటికీ ఇబ్బందిపడాల్సి వస్తుందన్నారు. రోజుకు 8 వేల క్యూసెక్కులు ప్రవహించేలా కాలువను వెడల్పు చేసి డిస్ట్రిబ్యూటరీ ద్వారా పొలాలకు నీరందించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, ఏఐకేకేఎంఎస్ నాయకులు రంగనాయకులు, సంజీవరాయప్ప, పంప నూరు, వై.కొత్తపల్లి, పంపనూరు తండా, సిద్ధలాపురం, ఎంఎం హళ్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆ రైళ్లు మరో నెల 'అనంత' నుంచే రాకపోకలు

అనంతపురం సిటీ: ధర్మవరం–మచిలీపట్నం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లు (నంబర్: 17215/17216) మరో నెల రోజుల పాటు (మే1 వరకూ) అనంతపురం రైల్వే స్టేషన్ నుంచే రాకపోకలు సాగిస్తాయని స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ తెలిపారు. ధర్మవరం వద్ద రైల్వే పనులు జరుగుతున్న దృష్ట్యా అనంతపురం వరకే పరిమితం చేశారని వివరించారు.

● ఉగాది సందడి



అనంతపురంలోని పాతూరులో కోలాహలం



అనంతపురంలో ఓ వస్త్ర దుకాణం వద్ద సందడి



పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఉగాది సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా సందడి నెలకొంది. పండుగ సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. అనంతపురంలోని పాతూరు కిక్కిరిసిపోయింది. పూలు,మామిడాకుల కొనుగోలుకు జనం ఎగబడ్డారు. వస్త్ర దుకాణాల వద్ద కోలాహలం కనిపించింది. ఆదివారం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ప్రజలకు 'ఉగాది' శుభాకాంక్షలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



అనంతపురం కార్పొరేషన్: జిల్లావాసులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన క్యాంపు కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. విశ్వవసు నామ తెలుగు సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని 'అనంత' ఆకాంక్షించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతన్నకు మేలు జరగాలన్నారు. ప్రజలందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, దేవుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకున్నారు.

రేపటితో ధాన్యం కొనుగోలు ముగింపు

అనంతపురం అర్బన్: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సోమవారంతో ముగుస్తుందని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో 23 వేల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. ఇందులో 14 వేల టన్నులు కొనుగోలు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించగా ఇప్పటికి 13,912 టన్నులు సేకరించామన్నారు. గడువు ఈనెల 31తో ముగుస్తున్నందున కొనుగోలు కేంద్రాలు మూసివేస్తామన్నారు. రైతులు ఇంకనూ ధాన్యం విక్రయించాల్సి ఉంటే కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భూ వివాదం.. కానరాని మోక్షం!

- డీఆర్‌ఓ, జేసీ కోర్టుల్లో పెరుగుతున్న కేసులు
- కళ్యాణదుర్గం డివిజన్ నుంచి అధికంగా దాఖలు
- నంబర్ కేటాయింపునకే నెలలు పడుతున్న వైనం

అనంతపురం అర్బన్: జిల్లాలో భూ వివాదాల కేసులు పెరుగుతున్నాయి. న్యాయం కోసం బాధితులు డీఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఇరు కోర్టుల్లోనూ కేసుల సంఖ్య పెరుగుతోంది. శనివారం డీఆర్‌ఓ కోర్టులో విచారణకు వచ్చిన వారితో ప్రాంగణం కిక్కిరిసింది. ఒకవైపు కేసులు పరిష్కారమవుతున్నా.. మరోవైపు అంతకంటే రెట్టింపు పిటీషన్లు దాఖలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కళ్యాణదుర్గం డివిజన్ పరిధి నుంచి డీఆర్‌ఓ కోర్టులో పిటీషన్లు అధికంగా దాఖలవుతున్నట్లు తెలిసింది.



పిటీషనర్లతో శనివారం కిక్కిరిసిన అనంతపురంలోని డీఆర్‌ఓ కోర్టు

నంబర్ కేటాయింపునకే నెలలు

భూ వివాదానికి సంబంధించి తొలుత బాధితులు డీఆర్‌ఓ కోర్టులో పిటీషన్ దాఖలు చేస్తారు. ఆ పిటీషన్‌కు నంబరు కేటాయింపు తరువాత కేసుకు సంబంధించి రిపోర్టును తహసీల్దారు నుంచి తెప్పించుకుంటారు. అనంతరం విచారణ ప్రారంభమవుతుంది. అయితే మూడు, నాలుగు నెలలు దాటినా పిటీషన్‌కు నంబరు కేటాయింపు జరగడం లేదని సమాచారం. అటు తరువాత రిపోర్టు తెప్పించుకుని విచారణ పూర్తయ్యి తీర్పు వచ్చే సరికి ఏళ్లు గడుస్తున్నట్లు తెలిసింది. డీఆర్‌ఓ కోర్టు తీర్పుతో సంతృప్తి చెందని వారు తిరిగి కేసును జాయింట్ కలెక్టర్ కోర్టులో దాఖలు చేస్తారు.

విచారణ దశలో 480 కేసులు..

డీఆర్‌ఓ కోర్టులో విచారణ దశలో దాదాపు 300 కేసులు ఉండగా నంబర్ కేటాయించాల్సిన కేసులు సుమారు 250 ఉన్నట్లు తెలిసింది. ఇక జాయింట్ కలెక్టర్ కోర్టులో దాదాపు 180 వరకు కేసులు విచారణ దశలో ఉన్నట్లు సమాచారం. డీఆర్‌ఓ కోర్టులో దాఖలవుతున్న పిటీషన్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నట్లు తెలిసింది. జాయింట్ కలెక్టర్ కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల్లో చాలా వరకు కోవిడ్ సమయం నుంచి అంటే దాదాపు మూడేళ్లుగా కొనసాగుతుండడం గమనార్హం.

త్వరితగతిన పరిష్కరిస్తున్నాం



కేసులను త్వరితగతిన పరిష్కరిస్తున్నాం. చాలా కేసులు కోవిడ్ సమయంలో దాఖలైనవి ఉన్నాయి. కరోనా కారణంగా అప్పట్లో కోర్టు పనిచేయలేదు. దీంతో కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఒకట్రెండు విచారణల్లోనే కేసులను పూర్తి చేస్తున్నాం.
– శివ్ నారాయణ్ శర్మ, జాయింట్ కలెక్టర్

రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రజాస్వామ్యంపై దాడి

- తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి దౌర్జన్యాలు తీవ్రమయ్యాయి
- మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

అనంతపురం: రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా విమర్శించారు. శనివారం అంజాద్‌బాషాతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్, కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసుల్ అజమ్, అనంతపురం మేయర్ వసీం సలీం తదితరులు ఎస్పీ జగదీష్‌ను కలిసి తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఇటీవల పట్టణంలో పార్టీ మైనార్టీ నేత ఫయాజ్ బాషా ఇంటిపై జేసీ వర్గీయుల దాడిని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఫయాజ్‌బాషా తాడిపత్రికి వెళ్లకుండా ఆంక్షలు విధించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ దేశమంతా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలవుతుంటే.. రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని ప్రజలందరూ భావిస్తున్నారన్నారు. మరీ ముఖ్యంగా తాడిపత్రిలో ప్రత్యేక రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. పట్టణంలో ఇటీవల వైఎస్సార్ సీపీ నేత ఫయాజ్ ఇంటిపై మునిసిపల్ చైర్మన్‌తో పాటు టీడీపీ నాయకులు ఏ విధంగా దాడి చేశారో ప్రజలందరూ చూశారన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఎస్పీని కలిసి తాడిపత్రికి వెళ్లడానికి అనుమతి కోరామన్నారు. 'తాడిపత్రిలో పరిస్థితులు బాగా లేవు, ఎస్కార్టుతో ఫయాజ్‌ను తాడిపత్రికి పంపుతామ'ని ఎస్పీ హామీ ఇచ్చారన్నారు. అల్లరి మూకలతో గొడవ చేసింది కాక తిరిగి ఫయాజ్‌పైనే రివర్స్ కేసు పెట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అణగారిన వర్గాలపైనే ఎక్కువగా దాడులు జరుగుతున్నాయన్నారు. వినుకొండలో మైనార్టీ సోదరుడు రషీద్ హత్యే ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ జెండా పట్టుకుంటే అంతు చూస్తామనేలా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. వినుకొండలో రషీద్‌కు జరిగినట్లే తాడిపత్రిలో జరగదని హామీ ఇవ్వగలరా అని ఎస్పీని కోరామన్నారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, చిత్రంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీ ఇసాక్ తదితరులు

పెరిగిన హింసా రాజకీయాలు..

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు 'అనంత' మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రంలో హింసా రాజకీయాలు పెచ్చరిల్లాయన్నారు. తాడిపత్రిలో ఫయాజ్ బాషా ఇంటిపై జేసీ వర్గీయులు దాడి చేయడం సరికాదన్నారు. ఇఫ్తార్ విందు ఇస్తానని ఫయాజ్ ప్రకటించిన తర్వాతనే దాడి జరిగిందని, టీడీపీ దౌర్జన్యాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ఫయాజ్ బాషా ఇఫ్తార్ విందు ఇస్తే జేసీకి సమస్యేంటని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఇసాక్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో మైనార్టీ నేత ఇంటిపై రాళ్లతో దాడి చేయడం అన్యాయమన్నారు. బాధితుడు ఫయాజ్ మాట్లాడుతూ జేసీ ప్రభాకర్ రెడ్డి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణ హాని ఉందన్నారు. ఎవరికేం జరిగినా ప్రభాకర్ రెడ్డితో పాటు పోలీసులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గతంలోనూ తమ ఇంటిని కాల్చారని, పరిశ్రమలను దగ్ధం చేశారని, చర్లపల్లి జైలుకు పంపారని వాపోయారు. ఇంటిని అక్రమంగా నిర్మిస్తే మున్సిపల్ అధికారులు రావాలి గాని ప్రభాకర్ రెడ్డి ఎలా వస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

'రెసిడెన్షియల్' ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

- ఏప్రిల్ 6 వరకూ అవకాశం

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్‌తోపాటు ఏపీ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో (2025–26 విద్యా సంవత్సరం) ప్రవేశానికి దరఖాస్తు గడువును ఏప్రిల్ 6వ తేదీ వరకూ పొడిగించినట్లు కొడిగెనహళ్లి ఏపీఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. శనివారం ఆయన పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొడిగెనహళ్లి పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి 80 సీట్లు అందుబాటులో ఉన్నాయని, రాయలసీమలోని ఉమ్మడి నాలుగు జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలురు మాత్రమే అర్హులన్నారు. అదే విధంగా 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 'ఏపీఆర్ఎస్ క్యాట్ 2025'కు, www.aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే కళాశాలల్లో ప్రవేశానికి ఆసక్తి కలిగిన వారు 'ఏపీఆర్ జేసీ, ఏపీఆర్ డీసీ సెట్ 2025'కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● సూరీడు.. సుర్రు

బొమ్మనహాళ్‌లో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



అనంతపురం అగ్రికల్చర్: సూరీడు మండిపోతున్నాడు. జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. రోజురోజుకూ 'అనంత' అగ్నిగుండంలా మారుతోంది. శనివారం బొమ్మనహాళ్‌లో 42.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. గుంతకల్లు–42 డిగ్రీలు, యల్లనూరు–41.1, విడపనకల్లు–41, శింగనమల–40.9, కూడేరు–40.8, తాడిపత్రి–40.7, నార్పల–40.5, పుట్లూరు–40.3, గార్లదిన్నె, యాడికి, గుత్తి, పెద్దవడుగూరు–40.1 డిగ్రీలు నమోదైంది. అటు శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా కొత్తచెరువు–41.2 డిగ్రీలు, చెన్నేకొత్తపల్లి–41.2,తాడిమర్రి–41.1,ముదిగుబ్బ–41, కనగానపల్లి–40.6, పుట్టపర్తి–40.4, నల్లమాడ, గుడిబండ, బత్తలపల్లి –40.3, ధర్మవరం, రామగిరి–40.2, తలుపుల–40.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 20 నుంచి 28 డిగ్రీల మధ్య నమోదవుతూ సెగలు పుట్టిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: ఉగాది ఉత్సవాలను సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహిద్దామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఇందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారన్నారు. వేద పండితుల ఆశీర్వాదం, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, ఉగాది పచ్చడి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రవేశ ద్వారం, వేదిక అలంకరణ అద్భుతంగా ఉండాలని, కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ప్రొటోకాల్, బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. చిన్న పొరపాటుకూ తావివ్వకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు.కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్డీఓ కేశవ నాయుడు, నగర పాలక కమిషనర్ బాలస్వామి, డీఈఓ ప్రసాద్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నీటి నాణ్యత పరీక్షలు ఎప్పటికప్పుడు చేపట్టాలి

రాప్తాడురూరల్: నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలను ఎప్పటికప్పుడు చేపట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శనివారం అనంతపురం రూరల్ పరిధిలోని ఆలమూరు గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చేపడుతున్న నీటి నాణ్యత పరీక్షలను కలెక్టర్ తనిఖీ చేశారు. వేసవి నేపథ్యంలో నీటి నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రిపోర్టులను రోజూ తమకు అందజేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ దివాకర్, పంచాయతీ సెక్రటరీ గోవిందరాజులు ఉన్నారు.

జిల్లా సుభిక్షంగా ఉండాలి

జిల్లా ప్రజలకు కలెక్టర్ వి.వినోద్ కుమార్ నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవసు నామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో జిల్లా సుభిక్షంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషకర జీవనం గడపాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

గార్లదిన్నె: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ఉగాది పండుగ వేళ చోటు చేసుకున్న ఘటనలతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన షేక్షావలి (32) కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది శనివారం ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

ఆత్మకూరు: సనప గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ (29) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. వినోద్‌కుమార్ అనంతపురంలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం తల్లి లక్ష్మీదేవి ఉగాది పండుగ సరుకుల కోసం అనంతపురం వెళ్లింది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వినోద్‌కుమార్ ఉరివేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత ఇంటికి చేరుకున్న తల్లి తలుపులు తట్టగా లోపల నుంచి స్పందన లేదు. కిటికీలోంచి చూడగా కొడుకు ఉరికి వేలాడూ కనిపించడంతో గట్టిగా కేకలు వేసింది. స్థానికులు వచ్చి తలుపులు బద్దలుకొట్టి మృతదేహాన్ని కిందకు దింపారు. ఇతడికి వివాహం కాలేదు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.


వినోద్‌కుమార్ (ఫైల్)

సంతోషం.. వెనువెంటే విషాదం!

- ఉద్యోగం ఆర్డర్ కాపీ అందుకుని మృత్యుఒడిలోకి జారిన తల్లి
- మతిస్థిమితం కోల్పోయిన తండ్రి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు

అసలే నిరుపేద కుటుంబం... రోజూ కూలి పనులకు వెళితేనే పూట గడుస్తుంది... లేకుంటే పస్తులతోనే గడపాల్సి ఉంటుంది. ఇటువంటి పరిస్థితిలో ఆ ఇల్లాలికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. ఈ సంతోషం ఎంతో సమయం నిలవలేదు. విధి వక్రీకరించడంతో ఉద్యోగం ఆర్డర్ కాపీ అందుకున్న రోజే ఆరోగ్య పరిస్థితి విషమించి ఆస్పత్రి పాలైంది. చికిత్స పొందుతూ మృతి చెందింది. పిల్లలు అనాథలయ్యారు.


జ్యోతి (ఫైల్)

గుమ్మఘట్ట: బేలోడు గ్రామానికి చెందిన నడిమింటి తిప్పేస్వామి, రత్నమ్మ దంపతుల రెండవ కుమార్తె జ్యోతి పుట్టుకతోనే అంధురాలు. పదేళ్ల క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా దొడగట్ట గ్రామానికి చెందిన తిప్పేస్వామితో జ్యోతికి పెళ్లైంది. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. భర్త కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. సజావుగా సాగిపోతున్న వీరి కాపురానికి గుర్తుగా ప్రతాప్, ప్రకిత, రాజు అనే ముగ్గురు సంతానం కలిగారు.

వికలాంగుల కోటాలో ప్రభుత్వ ఉద్యోగం

నాలుగు నెలల క్రితం బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో వికలాంగుల కోటా కింద జ్యోతి దరఖాస్తు చేసుకుంది. జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ చేపట్టిన ఇంటర్వ్యూకు హాజరైన ఆమెకు అర్హతే ప్రామాణికంగా బుక్కరాయసముద్రం జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో స్వీపర్ పోస్టు దక్కింది. ఇందుకు సంబంధించిన ఆర్డర్ కాపీని గత నెల 19న అందుకున్న జ్యోతి... ఉన్నఫళంగా కుప్పకూలిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

సంబరం వెనుకే కన్నీళ్లు...

జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని తెలియగానే ఇటు పుట్టినిల్లుతో పాటు అటు మెట్టినింట్లో సంబరాలు చేసుకున్నారు. ఆరోగ్యం కుదుట పడి విధుల్లో చేరాలని పూజలు చేశారు. నెలకు బేసిక్ రూ.20 వేలు, డీఏ, హెచ్ఆర్ఏ ఇతర అలవెన్సులు కలుపుకుని మొత్తం రూ.30 వేల వరకూ జీతం అందే ఉద్యోగం కావడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆశించారు. అయితే ఈ సంబరం ఎంత కాలమూ నిలవలేదు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 13న ఆమె కన్నుమూసింది. విషయం తెలియగానే భర్త తిప్పేస్వామి ఒక్కసారిగా కుదేలైపోయాడు. తీవ్ర మనోవేదనలో మతిస్థిమితం కోల్పోయి రోడ్డున పడ్డాడు.


అనాథలుగా మారిన చిన్నారులు ప్రతాప్, ప్రకిత, రాజు

అనాథలుగా పిల్లలు

తల్లి మృతి, తండ్రి దగ్గర లేకపోవడంతో అనాథలుగా మారిన ముక్కు పచ్చలారని ముగ్గురు చిన్నారులను అమ్మమ్మ రత్నమ్మ చేరదీసింది. అయితే ఆమె కుటుంబ పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో పిల్లల పోషణ ఆమెకు భారమైంది. దాతలు ఎవరైనా సహకరించి పిల్లల బాగోగులకు, చదువులకు ఆర్థిక సాయం చేయాలని నిస్సహాయ స్థితిలో రత్నమ్మ వేడుకుంటోంది.

సాయం చేయదలిస్తే...

పేరు :	నడిమింటి రత్నమ్మ
బ్యాంక్ :	ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, బేలోడు శాఖ
ఖాతా నంబర్ :	9106 524 0666
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ :	ఏపీజీబీ0001018

ట్రంప్ గెలుపుతో విధ్వంసకర విధానాలు వేగవంతం

- సీపీఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అరుణ్‌కుమార్ ధ్వజం


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

అనంతపురం సిటీ: అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైనప్పటి నుంచి విధ్వంసకర విధానాలను అగ్రరాజ్యం వేగవంతం చేసిందని సీపీఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్ ధ్వజమెత్తారు. జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో సీపీఎం జిల్లా అధ్యక్షుడు ఓ.నల్లప్ప అధ్యక్షతన 'ట్రంప్ విధానాలు – భారతదేశంపై ప్రభావం' అనే అంశంపై శనివారం సాయంత్రం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పనామా, గ్రీన్‌ల్యాండ్, కెనడా వంటి దేశాలను ఆక్రమించుకునే పద్ధతులను అమెరికా వేగవంతం చేయడంపై మండిపడ్డారు. ఇందులో భాగంగానే ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి రోజుకో వివాదాస్పద నిర్ణయాన్ని తీసుకువస్తున్నారని దుయ్యబట్టారు. ఒకవైపు శాంతి నెలకొల్పుతానంటూ ఇజ్రాయెల్ దాడులను తాత్కాలికంగా నిలిపివేయడం, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపినట్లుగా చూపిస్తోందని పేర్కొన్నారు. ఇదంతా శక్తివంతమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న చైనాను నిలువరించే క్రమంలోనే చేపడుతోందని వెల్లడించారు. తన ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచుకునే క్రమంలో ఇండియా, చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలపై ఆంక్షలు విధించేందుకు అగ్రరాజ్యం సిద్ధపడిందన్నారు. ఇండియా టారిఫ్ కింగ్ పేరుతో భారతదేశంపైనా ట్రంప్ ఒత్తిడి పెంచుతున్నట్లు ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, సీఐటీయూ ఓబులు, నాగేంద్ర, బాలరంగయ్య, సావిత్రి, రామిరెడ్డి, ముర్తుజా, నాగమణి, గేయానంద్ పాల్గొన్నారు.

నేడు పశువుల సంత బంద్

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ ఆదివారం పశువుల సంత ఉండదని సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

పండుగ పూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో బేల్దారి దుర్మరణం
- బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

రాప్తాడురూరల్: ఉగాది పండుగ పూట విషాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఒక బేల్దారి దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం యాలేరుకు చెందిన ఎస్.రామకృష్ణ (35), ఇస్మాయిల్, ఎర్రిస్వామి ముగ్గురూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. రోజువారి పనుల్లో భాగంగా ముగ్గురూ శనివారం ఉదయం గ్రామం నుంచి ఒకే బైకుపై అనంతపురం బయల్దేరారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని గుడ్‌విల్లెన్ స్కూల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన మహారాష్ట్రకు చెందిన లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ సర్వజన ఆస్పత్రికి తరలించారు. వీరిలో రామకృష్ణ పరిస్థితి విషమించి సాయంత్రం మృతి చెందాడు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.


మృతులు రామకృష్ణ, జయలక్ష్మి

రోడ్డు దాటుతూ.. మరొకరు

రాయదుర్గంటౌన్: పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. శ్రీనీల కంఠేశ్వరస్వామి ఆలయం వెనుక ప్రాంతంలో నివాసం ఉంటున్న జయలక్ష్మి (64) శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో బళ్లారిరోడ్డులో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనదారుడు ఢీకొన్నాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన జయలక్ష్మిని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రోడ్డు ప్రమాద ఘటనపై మృతురాలి బంధువులు పోలీసులకు సమాచారం అందించారు.

పందుల అపహరణ ముఠా సభ్యుల అరెస్ట్

బెళుగుప్ప: రాత్రిపూట పందులను అపహరించుకెళ్లే ముఠాలోని ఇద్దరు సభ్యులను ఎస్ఐ శివ శనివారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది జనవరి ఐదో తేదీ అర్ధరాత్రి పందులు అపహరణకు గురయ్యాయని బెళుగుప్పకు చెందిన రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అనుమానితులైన రాయదుర్గానికి ఎరుకుల నాగరాజు అలియాస్ గబ్బర్‌సింగ్, కళ్యాణదుర్గానికి చెందిన ఎరుకల ముత్యాలప్ప అలియాస్ బాలరాజును శుక్రవారం రాత్రి గుండ్లపల్లి క్రాసింగ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తే పందులు అపహరించి తామేనని ఒప్పుకున్నారు. పందులు విక్రయించగా వచ్చిన సొమ్ములోంచి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.15వేల చొప్పున మొత్తం రూ.30వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు ముఠా నేత అనంతపురానికి చెందిన ఆదినారాయణ, సభ్యుడు వెంకటేశులుతో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వెంకటేశులు పందుల అపహరణ కేసులో చిత్రదుర్గం పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయ్యారని, మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు. పట్టుబడిన ఇద్దరు దొంగలను కళ్యాణదుర్గం కోర్టులో హాజరు పరుచగా.. మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారన్నారు.

కరెంటు షాక్‌తో 26 అడవి పందుల మృతి

యల్లనూరు: తోటలోకి చొరబడిన అడవిపందులు కరెంట్‌షాక్‌కు గురయ్యాయి. 26 అడవిపందులు అక్కడికక్కడే మృతి చెందాయి. కల్లూరులో రైతు రామచంద్ర కుమారుడు మొక్కజొన్న సాగు చేశాడు. రాత్రిపూట అడవి పందుల గుంపు వచ్చి పంటను నాశనం చేస్తుండేవి. దీన్ని గమనించిన రైతు పొలం వద్ద కరెంటు కంచె వేశాడు. శుక్రవారం రాత్రి యథావిధిగా అడవిపందుల గుంపు వచ్చింది. తీగలు తాకగానే కరెంట్‌షాక్ కొట్టి 26 అడ అడవిపందులు ప్రాణం విడిచాయి. మరో ఐదారు పందులు తప్పించుకున్నాయి.


మృత్యువాత పడిన అడవి పందులు

పెన్షనర్ల విభాగం అధ్యక్షుల నియామకం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అనంతపురం నియోజకవర్గ అధ్యక్షునిగా తలారి వెంకటేశులు, గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షునిగా ఖాజాపురం జయరాం, రాయదుర్గం నియోజకవర్గ అధ్యక్షునిగా పి.రాజగోపాల్‌రెడ్డి, శింగనమల నియోజకవర్గ అధ్యక్షునిగా కె.హరిచంద్రారెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షునిగా ఎస్ తిప్పయ్యను నియమించారు.

గుట్టుగా శ్రీగంధం దుంగల తరలింపు


జంబుగుంపల చెక్‌పోస్ట్ వద్ద తరలుతున్న శ్రీగంధం దుంగలు

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, బెస్తరపల్లి అటవీ ప్రాంతాల నుంచి శ్రీగంధం దుంగలు అక్రమంగా తరలిపోతున్నాయి. కర్ణాటకకు చెందిన వ్యాపారులు రాత్రివేళ అటవీ ప్రాంతాల్లో శ్రీగంధం చెట్లతో పాటు టేకు తదితర చెట్లను నరికి, ముక్కలుగా చేసి శిరా, అమరాపురం, హిరియూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

క్లుప్తంగా

ఉగాది శుభాకాంక్షలు

- మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: ఉగాది పండుగను నగర ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మేయర్ క్యాంపు కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆ దేవుడిని వేడుకుంటున్నట్లు మేయర్ పేర్కొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



సయ్యద్ సర్దార్‌వలి దర్గాలో చదివింపులు చేస్తున్న ముల్లా సాహెబ్

ఆత్మకూరు: మండల కేంద్రంలోని సయ్యద్ సర్దార్‌వలి సాహెబ్ దర్గాలో శనివారం అనంతపురం పట్టణానికి చెందిన రమణ అనే వ్యక్తి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తొలుత అమావాస్య సందర్భంగా సయ్యద్ సర్దార్‌వలి దర్గాను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక చదివింపులు చేయించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్గాకు వచ్చి చక్కెర చదివింపులు చేయించారు. టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

శిల్పారామంలో నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్: ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండగలను పురష్కరించుకుని శిల్పారామంలో ఆదివారం నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకూ ఉగాది పంచాగ శ్రవణం, 6 గంటల నుంచి 8 వరకు నృత్యకళా నిలయం వారి ఆధ్వర్యంలో భరత నాట్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఏప్రిల్ 1న రంజాన్ పండగను పురష్కరించుకుని శ్రీకృష్ణదేవరాయల రంగస్థల కళాకారులు, ఆర్య డ్యాన్స్ అకాడమీ, స్ఫూర్తి విద్యానికేతన్ వారి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా శ్రీరామనవమిని పురష్కరించుకుని ఏప్రిల్ 6వ తేదీన సంరక్షిత బృందంతో భక్తిగాన నృత్య విభావరి ఉంటుందని పేర్కొన్నారు.

‘అనంత’తో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ



జిల్లా రాజకీయాలపై చర్చిస్తున్న నేతలు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నివాసానికి శనివారం వైఎస్సార్‌సీపీ నేతల బృందం వెళ్లింది. తాడిపత్రిలో జరుగుతున్న పరిణామాలపై వైఎస్సార్‌సీపీ నేతలు అనంతపురానికి వచ్చిన విషయం విదితమే. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఇసాక్, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసుల్ అజమ్, మేయర్ వసీం తదితరులు తాడిపత్రితో పాటు జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు.

విజయ్ సాయికి ఉగాది పురస్కారం



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న విజయ్ సాయి

అనంతపురం కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన మయూర ఆర్ట్స్ అకాడమీ వారు శనివారం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. నగరానికి చెందిన సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ్ సాయికి సినీ, టీవీ నటులు కెవ్వు కార్తిక్, గురు ఆదిత్యనాథ రెడ్డి, ప్రత్యూష, శిల్ప తదితరులు జ్ఞాపిక, పురస్కారం అందజేశారు. మూడు దశాబ్దాలుగా నిత్యన్నదానంతో యువతలో స్ఫూర్తిని నింపుతున్న విజయ్‌కుమార్ సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు.

ఇద్దరికి ఉగాది పురస్కారాలు

అనంతపురం కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది సందర్భంగా అందించే పురస్కారాలకు అనంతపురానికి చెందిన సీనియర్ కవి రాధేయ, జ్యోతిష్య విద్వాంసులు గురుమూర్తి ఎంపికయ్యారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ప్రభాకరచౌదరికి ‘కళారత్న’ అవార్డునందించనున్నారు. వీరందరూ ఆదివారం విజయవాడలో జరిగే పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులనందుకుంటారు.

విశ్వావసుకు స్వాగతం

- నేడు శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది
- లోగిళ్లలో విరబూసే తెలుగు పండుగ
- ఆలయాల్లో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు పూర్తి
- నగరంలో ఆకట్టుకోనున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు

సందర్భం: నేడు శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది



పండుగకు ఊరెళ్దాం..



పాతూరులో బంతిపూల విక్రయాలు



మామిడి ఆకులు తీసుకెళ్తున్న మహిళ

అనంతపురం కల్చరల్: ఉగాది మన తెలుగు పండుగ. తెలుగు కొత్త సంవత్సరం ఆరంభమయ్యే రోజు హిందూ క్యాలెండర్ ప్రకారం చైత్ర మాసంలో మొదటి రోజు ఉగాది పండుగను జరుపుకుంటాం. ఈ ఏడాది శ్రీవిశ్వావసు ఉగాది నామ సంవత్సరం పేరుతో వచ్చేసింది. తెలుగు వారి సంవత్సరాది తొలి పంటతో మమేకమై షడ్రుచుల సమ్మేళనంగా పలకరించనుంది. ప్రతి తెలుగు లోగిలిలో విరబూసే తెలుగుదనమే ‘ఉగాది’ పర్వదినం. కోటి ఆశలతో కొంగొత్త కాంతులతో వినూత్న ఆలోచనతో అనంత వాసుల హృదయాలను సంబరాల్లో ముంచెత్తడానికి ఆదివారం స్ఫూర్తిదాయక కార్యక్రమాలు ఉత్సాహంగా సాగనున్నాయి. యుగారంభమై శ్రీవిశ్వావసు నామ సంవత్సర ‘ఉగాది’ అందరిలో ఆత్మ విశ్వాసాన్ని నింపుతుందన్న ఆకాంక్షను కళాకారులు, సాహితీవేత్తలు వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికే ఉగాది సంబరం కొనుగోళ్ల రూపంలో నగరమంతటా జనంతో నింపేసింది. ‘ఉగ’ అంటే నక్షత్రాల గమనం లేదా సృష్టి అని. ‘ఆది’ అనగా ప్రారంభం అని అర్థం. సృష్టి ఆరంభమే లేదా యుగారంభమే యుగాది. అదే కాలక్రమంలో ఉగాదిగా రూపాంతరం చెందింది. తెలుగు వాకిళ్లలో తొలి పండుగ ఉగాది రూపంలో పలకరిస్తోంది. అన్ని పండుగల్లోకెల్లా ‘ఉగాది’కి చెప్పలేనంత ప్రత్యేకత ఉంది. ప్రతి ఏటా చైత్రశుక్ల పాడ్యమి రోజున వచ్చే ఈ పండుగను ప్రతి ఇంట్లో తోరణాలు కట్టి, వేపపూత పచ్చడి చేసి సాదరంగా ఆహ్వానిస్తారు. ఉగాది ఋతు సంబంధమైన పండుగ. ప్రకృత్యారాధనకు పేరుమోసిన మన పెద్దలు ఋతువుల్లో లభ్యమయ్యే ప్రకృతి పదార్థాలకు ఈ పర్వదినంలో విశేష ప్రాముఖ్యత ఉంటుంది. జీవిత గమనంలో కష్టసుఖాలను ప్రతిబింబించే షడ్రుచుల సమ్మేళనంతో ఈ పండుగ సరదాగా సాగిపోతుంది.

శ్రీక్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు

విజయతీరాలు చేరుకోవాలని పచ్చని తోరణాలు, మంగళవాయిద్యాలతో శ్రీక్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ.. శ్రీవిశ్వావసు నామ సంవత్సరానికి ఆహ్వానం పలుకుదాం. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం నగరంలో వివిధ కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాల్లోనే కాకుండా లలిత కళాపరిషత్తు, కృష్ణకళా మందిరంలో పెద్ద ఎత్తున సంబరాలు జరగనున్నాయి. కళాకారులకు పురస్కారాలు అందజేయనున్నారు. అలాగే శ్రీకళాపీఠం ఆధ్వర్యంలో రాణినగర్ బ్రహ్మంగారి ఆలయం వేదికగా ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం జరగనుంది. భక్ష్యాల పండువగా గ్రామీణ ప్రాంతాల్లో పిలుచుకునే ఉగాది సందర్భంగా మన భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసుకోవాలన్న ఉత్సాహాన్ని అందరిలో నింపడానికి ‘పంచాంగ శ్రవణం’ సందడి చేస్తుంది. తగిన జాగ్రత్తలను సూచిస్తుంది. అంబరాన్నంటే సంబరాలకు సిద్ధమవుతున్న ఉగాది రోజున నగరమంతటా విశేష కార్యక్రమాలు జరగనున్నాయి. మార్కెట్లు మామిడాకు, వేపపూత, పూలు, పండ్ల కొనుగోళ్లతో కిటకిటలాడాయి. ఇప్పటికే ప్రత్యేక పూజోత్సవాలకు ఆలయాలు శోభాయమానంగా ముస్తాబయ్యాయి.



బస్సులో సీటు కోసం పోటాపోటీ..

పచ్చడి ఆరోగ్యదాయకం



తెలుగువారి నూతన సంవత్సరాది ఉగాది.. ప్రకృతి ద్వారా ఆరోగ్య రహస్యాలను అందించే మహత్తర పరమావధి. తీపి, కారం, ఉప్పు, చేదు, వగరు, పులుపు.. వంటి షడ్రుచులు ఆరోగ్యానికి అత్యంత శ్రేష్టకరం. తెలుగు లోగిళ్లలో చిందులేసే నవవసంతం పరవళ్లు ఒకనాడు గ్రామీణ ప్రాంతాలను సుసంపన్నం చేసేవి. ఫ్యాషన్ ఒరవడిలో పాత ఆచారాలను మరచిపోకుండా తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఉగాది విశేషాలను ఈ తరం వారికి తప్పక అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు కళా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



భోజనం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మేయర్ వసీం



రంజాన్ తోఫా కిట్లు అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత, తదితరులు

అనంతపురం కల్చరల్: మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని కోవూరు నగర్ నిమ్రా మసీదులో మేయర్ వసీం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు అనంత వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉపవాస దీక్షాపరులకు ఖర్జూరాలు అందించి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ విశిష్టతను గురించి తెలియజేస్తూ అన్ని మతాల వారికి ఏకంగా నిలిపే ఇఫ్తార్లతో ఐక్యత సాధించే పర్వదినంగా అభివర్ణించారు. రంజాన్ అందరి జీవితాలలో సంతోషాలను తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు మతపెద్దలు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, నాయకులు ఖాజా, మెహ్రాజ్ తదితరులు పాల్గొన్నారు

రంజాన్ తోఫా పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: రంజాన్ పండుగను పురస్కరించుకుని శనివారం ఒకటవ డివిజన్ పరిధిలోని ఎర్రనేల కొట్టాలలో మైనార్టీ ఆసిఫ్ ఆధ్వర్యంలో, 16వ డివిజన్ బాబానగర్‌లో డివిజన్ కన్వీనర్ సుకేష్ ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ముున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. దాతృత్వానికి ప్రతీక రంజాన్ అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, నాయకులు హనుమంతు, వై.వెంకటరాముడు, కే.శ్రీనివాసులు, ఎం.బసవరాజు, రమణారెడ్డి, ఎస్కే కాలేష, పాల్గొన్నారు.

రూ.2 కోట్ల పన్ను వసూలు

అనంతపురం కార్పొరేషన్: రూ.2 కోట్ల పన్ను వసూలైనట్లు కమిషనర్ బాలస్వామి తెలిపారు. ఇంటి, ఖాళీ జాగా పన్ను చెల్లింపులకు సంబంధించి ఒకేసారి పన్ను చెల్లిస్తే వడ్డీపై ప్రభుత్వం కల్పించిన 50 శాతం రాయితీ పొందవచ్చని పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 30, 31 సెలవు దినాల్లోనే పన్ను చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్లతో పాటు వేణుగోపాల్ నగర్‌లోని 5వ సచివాలయం, పాతూరులోని 17వ సచివాలయం, రాంనగర్‌లోని 54వ సచివాలయం, శ్రీనగర్ కాలనీలోని 52వ సచివాలయం, రెండవ రోడ్డు స్టడీ పార్క్ పక్కన ఉన్న 64వ సచివాలయంలోనూ పన్ను చెల్లింపు కేంద్రాలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు

కనగానపల్లి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు జెడ్‌బీఎన్‌ఎఫ్ మాస్టర్ ట్రైనర్ పెద్దిరెడ్డి తెలిపారు. మండలంలోని ముక్తాపురం గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయం, ఖరీఫ్ పంటల సాగు ప్రణాళికలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, క్రిమి సంహారక మందులు వాడకుండా పంటలు సాగు చేయటంపై జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలోని ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ ఉద్యోగులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ల కాలంలో ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి, ఎంతగానో కృషి చేశామన్నారు. ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు కారుణ్య నియామకాలను ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా భర్తీ చేశామని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను సైతం దశల వారీగా పరిష్కరించామని వెల్లడించారు. ఎక్కడా ఎటువంటి ఆరోపణలకు తావు లేకుండా అర్హులైన వారందరికీ పదోన్నతులు కల్పించినట్లు పేర్కొన్నారు. త్వరలో మరి కొంత మందికి కూడా పదోన్నతులు కల్పించనున్నట్లు హామీ ఇచ్చారు. అయితే ఉద్యోగులు కూడా తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, జెడ్పీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు కార్యాలయ పని వేళల్లో తమ స్థానాల్లో ఉండి.. చేయాల్సిన పనిని పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఒకరిద్దరు పొద్దస్తమానం అనవసరంగా బయట తిరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అటువంటి వారు తమ పనితీరు మార్చుకోవాలని స్పష్టం చేశారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఏఓ ఉషను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య, ఏఓలు విజయభాస్కర్ రెడ్డి, షబ్బీర్ నియాజ్, మహబూబ్ వలి, రత్నాబాయి, శ్రీవాణి, ధనుంజయ, కమ్మ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని జ్యోతిబసు కాలనీలో పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు శనివారం సాయంత్రం దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.4,580 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కూల్ డ్రింక్ దుకాణానికి నిప్పు

- పూర్తిగా కాలిపోయిన ఫ్రిజ్, ద్విచక్ర వాహనం
- సకాలంలో చేరుకుని మంటలను అదుపు చేసిన రూరల్ పోలీసులు



పూర్తిగా కాలిపోయిన బైక్



ఫ్రిజ్‌లో మంటలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్ బళ్లారి రోడ్డులోని ఓ కూల్‌డ్రింక్ దుకాణానికి శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఈ ప్రమదంలో ఓ ద్విచక్ర వాహనం పూర్తిగా కాలిపోయింది. ఫ్రిజ్ స్వల్పంగా కాలింది. వివరాల్లోకి వెళ్తే.. కె.బాబు అనే వ్యక్తి నాలుగేళ్లుగా కూల్ డ్రింక్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి దుకాణం కట్టిపెట్టి ఇంటికి వెళ్లాడు. రాత్రి 1 గంట సమయంలో బయట ఉన్న ఫ్రిజ్, రెండు బైకులకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. ప్రధాన రహదారి కావడంతో మంటలు చూసి అటుగా వెళ్తున్న కొందరు నేరుగా రూరల్ సీఐ శేఖర్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. వెంటనే బ్లూకోట్స్ సిబ్బంది దేవేంద్ర, నాగేంద్రను అప్రమత్తం చేశారు. వారు హుటాహుటిన అక్కడి చేరుకుని పక్కన ఉన్న ఇళ్ల నుంచి నీళ్లు తెప్పించి మంటలను అదుపులోకి తెచ్చారు. సీఐ శేఖర్ అక్కడికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో మహేష్ అనే వ్యక్తికి చెందిన ఒక బైకు పల్సర్ పూర్తిగా కాలిపోయింది. స్ప్లెండర్ బైకు స్వల్పంగా కాలింది. చుట్టుపక్కల సీసీ కెమరా ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దుకాణ యజమాని, బైకుల యజమానికి గాని ఎవరితోనైనా వ్యక్తిగత కక్షలు ఉన్నాయా? అని ఆరా తీశారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కాగా ఈ ఘటనపై బాధితులు శనివారం ఉదయం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోదండ రామాలయంలో అపచారం

- మరమ్మతుల పేరిట మూలవిరాట్టు కింది భాగాన్ని కొట్టేయడం తగదు
- బ్రాహ్మణ సంఘాల మండిపాటు



మూలవిరాట్టుల వద్ద మరమ్మతులు చేసిన దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని కోదండ రామాలయంలో అపచారం జరిగింది. వేదపండితులకు తప్ప ఇతరులెవరికీ ప్రవేశం లేని గర్భాలయంలోకి ప్రవేశించి మరమ్మతుల పేరిట మూల విరాట్టు విగ్రహాల కింది భాగాన్ని కొట్టేయడం తగదని బ్రాహ్మణ సంఘాలు మండిపడ్డారు. నిత్యపూజోత్సవాలు జరిగే గర్భాలయాల్లో మరమ్మతులకు ఉన్నతాధికారుల అనుమతి అవసరమున్నా ఆ విషయమే పట్టించుకోకపోవడంతో పాటు ఆగమ శాస్త్ర నియమాలు కూడా పాటించకుండా అన్యులను ఈఓ ఎలా అనుమతిస్తారని ఆలయ అనువంశీకుడు రామసుబ్రమణ్యం, అంతర్రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా కన్వీనర్ మఠం ఆనంద్, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు కాశీ విజయకుమార్ ప్రశ్నించారు. విషయాన్ని ఎండోమెంటు డిప్యూటీ కమిషనర్ నెట్టెం గురుప్రసాద్, కమిషనర్ రామచంద్రమోహన్ దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన వారు వెంటనే పనులు ఆపేయమని వారు ఈఓ ఆదేశించారని తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్ సోమర జయచంద్ర నాయుడు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని కోరారు. కాగా, గర్భాలయంలో ఉన్న ఫ్లోర్ దెబ్బతిందని, దానికి తోడు నిత్య అభిషేకం చేస్తున్న నీరు బయటకు పోవడంలో ఇబ్బందులుంటే తామే మరమ్మతులు చేయాలని కోరామని ఆలయ ప్రధాన అర్చక బృందాలు తెలపడం గమనార్హం. దీనిపై ఈఓ శోభారాణి ‘సాక్షి’తో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం పనులు నిలిపేశామని, త్వరలో శాస్త్రోక్తంగా మరమ్మతులు పూర్తి చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

31 నుంచి మురడిలో బ్రహ్మ రథోత్సవం

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని మురడి ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 2 వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. 31న రాత్రి 7 గంటలకు ముత్యాల పల్లకి, ఏప్రిల్ 1న సాయంత్రం 5 గంటలకు బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు.